మార్కెట్లకు లక్ష్మీకళ

కిటకిటలాడిన దుకాణాలు

సౌభాగ్యం, సంపద, కుటుంబ శ్రేయస్సు కోసం చేసే పూజల్లో శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రతం ప్రధానమైనది. ఈ వ్రతాన్ని ఆచరించేందుకు మహిళలు సంసిద్ధులయ్యారు. శుక్రవారం పూజకు కావలసిన వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులతో మార్కెట్లు సందడిగా మారాయి.



పెదగంట్యాడ మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన బంగారు కాసులు



కొత్త గాజువాకలో కిటకిటలాడుతున్న కణితి మార్కెట్



పూజా సామగ్రిని బేరమాడుతున్న మహిళ

గాజువాక/పెదగంట్యాడ : మార్కెట్లు శ్రావణశోభను సంతరించుకున్నాయి. గాజువాక, పెదగంట్యాడలోని దుకాణాలన్నీ గురువారం కొనుగోలుదారులతో కళకళలాడాయి. జనం తాకిడితో గాజువాక మెయిన్ రోడ్డు, బీసీ రోడ్, కణితి, పెదగంట్యాడ రోడ్లు రద్దీగా మారాయి.

లక్ష్మీకాసులకు డిమాండ్

వరలక్ష్మీ వ్రతానికి అవసరమైన లక్ష్మీకాసులు, జాతిరాళ్ల ఆభరణాలు, పచ్చలు, కెంపులు, మగువలు మెచ్చే రీతిలో అందుబాటులో ఉంచడంతో పాటు ఆఫర్లను ప్రకటించడంతో బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో నిండుగా కనిపించాయి. వరలక్ష్మీ వ్రతం రోజు వీసమెత్తు కొత్త బంగారమైనా ధరించాలన్న నమ్మకంతో మహిళలు, యువతులు బంగారం దుకాణాలకు క్యూ కట్టారు. ముఖ్యంగా లక్ష్మీదేవి రూపం గల బంగారు కాసులు, అరగ్రాము నుంచి ఉన్న చిన్న డాలర్లను అందుబాటులో ఉంచడంతో మహిళలు ఆసక్తిగా కొనుగోలు చేశారు.

షోరూమ్‌లలో రద్దీ

వినియోగదారుల అభిరుచులకనుగుణంగా వస్త్ర వ్యాపారులు దేశంలోని పలు నగరాలు, పట్టణాల నుంచి వివిధ మోడళ్ల వస్త్రాలను తీసుకొచ్చి ప్రత్యేక రాయితీలతో విక్రయించడంతో షోరూమ్‌లు రద్దీగా మారాయి. ఇవే కాకుండా ఫుట్‌వేర్, ఫర్నిచర్ దుకాణాలలో సందడి నెలకొంది.



పూజా సామగ్రి వద్ద కొబ్బరి కాయల స్టాల్

ధరల మోత

ఇక డిమాండ్‌ను అనుసరించి వ్యాపారులు అమాంతం రేట్లు పెంచేయడంతో వస్తువుల ధరలకు రెక్కలు వచ్చాయి. ఒక్క కొబ్బరికాయ ధర రూ.40, గుప్పెడు మామిడాకుల ధర రూ.20, రెండు పువ్వులు రూ.25, డజను అరటిపళ్లు (చిన్న సైజు) రూ.100కి పైమాటే. ఇక మిగిలిన సామగ్రి ధరల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పువ్వుల ధర కేజీపై ఒక్కసారిగా రూ.230 పెంచి విక్రయించారు. కిలో చామంతి రూ.800 వరకూ అమ్మారు. ధరలన్నీ ఆకాశాన్నంటడంతో కొనుగోలుదారులు పెదవి విరిచారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎంత ధరైనా చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

నిర్వాసిత కాలనీల్లో..

కూర్మన్నపాలెం: ఉక్కు నిర్వాసితకాలనీలు వరలక్ష్మి వ్రతం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయి. కాలనీల్లోని మహిళలు తమ ఇళ్లతో పాటు దేవాలయాలను శుభ్రం చేసి అందంగా అలంకరించారు. వడ్లపూడి ప్రాంతంలో దేవాలయాలు, గుడులు లెక్కకుమించి ఉండడంతో అన్ని చోట్ల జనం కలివిడిగా కనిపిస్తున్నారు.

రద్దీగా మార్కెట్లు

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంచుమించు అన్ని రహదారుల్లో తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. వ్రతానికి అవసరమైన చీర జాకెట్టుతో పాటు పసుపు, కుంకుమ, ఆకువక్క, పూలు,పండ్లు, టెంకాయ, మామిడి ఆకులు, తదితర వస్తువులన్నీ రోడ్లమీదే అమ్మకానికి పెట్టారు. మహిళలు వాటిని కొనుగోలు చేయడానికి రావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా కూర్మన్నపాలెం ప్రధాన రహదారి, వడ్లపూడి సంతతోట ప్రాంతం, యాదవజగ్గరాజుపేట సంత జనంతో కళకళలాడాయి. వడ్లపూడి సంతతోట వద్ద ఉదయం నుంచి రద్దీగానే కనిపించింది.



మార్కెట్‌లో వినియోగదారుల రద్దీ



జనంతో నిండిపోయిన వడ్లపూడి సంతతోట రోడ్డు

ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు



సాయి భక్తి గీతాలు ఆలపిస్తున్న భక్తులు

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీ సాయి బాబా ఆలయంలో గురువారం ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు జరిపించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఐదు గంటలకు నగర సంకీర్తన చేపట్టారు. సెక్టార్ – 2లోని పెదమడక, కొండయ్యవలస, బీసీ కాలనీల్లో భక్తి గీతాలాలపిస్తూ, సాయి నామస్మరణతో నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం ఆలయంలో సాయి భక్తి గీతాలాపన చేశారు. కార్యక్రమంలో షిర్డీ సాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య రమణారెడ్డి, సత్యసాయి భజన మండలి ప్రతినిధులు బి.వి.సుబ్బారావు, విందుల పైడినాయుడు, వరహాలు, డాక్టర్ వేచలపు రామారావు, బి.ఈశ్వరరావు, సి.వి.రామన్, ధర్మాల వ్యాసశర్మ, శంభుడు, సత్యలక్ష్మి, లీలావతి, కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించిన అధికారులు



రోడ్డుపై చెత్త తొలగిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ : 'పూడిక తీశారు.. వదిలేశారు' శీర్షికతో ఈ నెల 2న సాక్షిలో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ స్పందించారు. వార్డు శానిటరీ సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. గంగవరం పోర్టు వంతెన నుంచి స్టీల్‌ప్లాంట్ గేటుకు వెళ్లే మార్గంలో గెడ్డల్లోంచి పూడిక తీసి రోడ్డుపై వేయడంతో స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడేవారు. దుర్వాసన వస్తుందని ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఉండేది. దీంతో ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. రోడ్డుపై వేసిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

క్లుప్తంగా

స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గాజువాక : జాతీయ సేవా పథకంలో భాగంగా స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. వందే భారత్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 180 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో దేనికైనా ప్రత్యామ్నాయం ఉందని, రక్తానికి మాత్రం లేదన్నారు. విద్యార్థులు సామాజిక సేవలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు ఎం.సత్యప్రకాష్, ఆర్.వి.ఆర్.పాత్రుడు, ఎస్.శ్రీను, బీవీపీవీ నర్సింహమూర్తి, బి.తిరుపతిరావు, కె.శివకృష్ణ, కె.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు రేపు

ఉక్కునగరం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు శనివారం ఉక్కునగరంలో నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు ఉక్కు క్లబ్ ఎంపీ హాలులో వేడుకలు నిర్వహించనున్నారు. అతిథులుగా సీఎండీ ఎ.కె.సక్సేనా, డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, జి.వి.ఎస్.ప్రసాద్, సలీం జి.పురుషోత్తమన్, సీజీఎం (వర్క్స్) ఆర్.మహంతితోపాటు అనేక మంది ఉన్నతాధికారులు హాజరవుతారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తౌడన్న, బయ్యే మల్లయ్య తెలిపారు.

వైభవంగా ముత్యమాంబ పండగ



ముత్యమాంబ పండగలో పాల్గొన్న తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు

పెదగంట్యాడ : జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరం గ్రామస్తుల ఆరాధ్య దేవత ముత్యమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కర్ణవానిపాలెంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కర్ణవానిపాలెం సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గాజువాక : విద్యుత్ సరఫరాలో సమస్యలు పరిష్కరించడంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ అధికారులు కర్ణవానిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. శ్రీనగర్, కర్ణవానిపాలెం, అఫీషియల్ కాలనీ, స్వతంత్రనగర్ కాలనీలకు భవిష్యత్‌లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా 8 ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్టు సహాయ ఇంజినీర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు గురువారం ప్రారంభించారు. ఈఈ ఉషారాణి, డీఈఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలుర గృహాలకు వితరణ

ఆరిలోవ : చినగదిలి ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర గృహాలకు పినాకిల్ ఆస్పత్రి సీఎస్ఆర్ నిధులతో సహకారం అందించింది. ఇక్కడి ప్రభుత్వ బాలుర గృహంతో పాటు ప్రభుత్వ పరిశీలనా గృహానికి వేర్వేరుగా 160 ఏహెచ్ బ్యాటరీలు, ఫ్లడ్ లైట్లు, ఇనుప అలమరాలు, 12 అంగుళాల ఎగ్జాస్ట్ ఫ్యాన్లను పినాకిల్ ఆస్పత్రి ప్రతినిధులు ఆయా గృహాల సూపరింటెండెంట్లకు గురువారం అందించారు. కార్యక్రమంలో బాలుర గృహం, పరిశీలనా గృహాల సూపరింటెండెంట్లు రమణ, షణ్ముఖరావు, పినాకిల్ సీనియర్ మేనేజర్ మణిరాజు, సెక్రటరీ సోని పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నూతన విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ సివిల్ అండ్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్.త్రిపాఠిని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం నాయకులు ఆయనను కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ త్రిపాఠి చిన్న స్థాయి నుంచి అంచెలంచెలుగా విభాగాధిపతి స్థాయికి చేరడం ఆయన చేసిన కృషికి నిదర్శనమన్నారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. విభాగంలోని ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. అనంతరం త్రిపాఠి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు రమణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, ఈశ్వరరావు, వెంకన్న, వెంకటరాజు, సాహు, ఎల్లాజీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.



నూతన విభాగాధిపతి త్రిపాఠిని అభినందిస్తున్న నాయకులు

పేదలకు సరకులు, చీరల వితరణ



పేదలకు వస్త్రాలు, సరకులు అందిస్తున్న సౌత్ ఏసీపీ, గాజువాక తహసీల్దార్ తదితరులు

గాజువాక : సినీ నటుడు ఐనవోలు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరకులు, చీరలు, గొడుగులు పంపిణీ చేశారు. ప్రసన్నకుమార్ తండ్రి జానీబాబు 16వ వర్ధంతి సందర్భంగా శ్రీనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సౌత్ సహాయ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరావు చేతులమీదుగా వాటిని పంపిణీ చేశారు. అనంతరం రోడ్లపై నిద్రిస్తున్న పేదలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో టీవీ హాస్యనటుడు సత్తిపండు, గాజువాక తహసీల్దార్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, సిరట్ల శ్రీనివాస్, గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మెజీషియన్ విజయకుమార్‌కు కళా పురస్కారం

ఉక్కునగరం : ప్రముఖ మెజీషియన్, స్టీల్‌ప్లాంట్ మాజీ అధికారి విజయకుమార్‌కు కళా పురస్కారం లభించింది. ఎస్‌వీ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కళారంగం, సేవా రంగాల్లో ప్రతిభ చూపిన వ్యక్తులకు ఏటా ఈ అవార్డులను అందజేస్తారు. మేజిక్ రంగం అభివృద్ధికి విజయకుమార్ చేసిన కృషిని గుర్తించి ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. గురువారం రాజమండ్రిలోని శ్రీజ్ఞాన సరస్వతి ఘాట్ వద్ద కళా, సేవా పురస్కారాల అవార్డుల వేడుక ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ చల్లగాలి శ్రీనివాస వర్మ చేతుల మీదుగా విజయకుమార్ ఈ అవార్డును అందుకున్నారు.

ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మేజిక్ అంటే మంత్రం అనే ముసుగులో జరిగే భూటకమన్నారు. మంత్రాలనేవి లేవని, కేవలం ట్రిక్ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు, ఎం.కృష్ణమాచార్యులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న విజయకుమార్

సాంకేతిక ప్రపంచంలో నైపుణ్యాలే కీలకం



మాట్లాడుతున్న విజ్ఞాన్ సంస్థల చైర్మన్ రత్తయ్య



ఎంఎన్‌సీలో ఉద్యోగావకాశం పొందిన విద్యార్థిని, అతని మాతృమూర్తిని సత్కరిస్తున్న అతిథులు

అగనంపూడి: సాంకేతికంగా శక్తివంతంగా మారుతున్న నేటి యుగంలో విద్యార్థులు ఉపాధిని మించిన నైపుణ్యాలపై దృష్టి సారించాలని టీసీఎస్ ఇండియా ఇన్‌చార్జి జి.శేఖర్, డెల్టా కాపిటా, ఆక్సిజన్ టాలెంట్ ఉపాధ్యక్షుడు అర్నాబ్ గుహ నియోగి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుని వివిధ ఎంఎన్‌సీల్లో ఉద్యోగావకాశాలు పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యార్థులు మంచి నైపుణ్యాలు సాధించడం వల్లనే అత్యధికశాతం మంది కంపెనీల్లో ఉద్యోగాలు పొందడమే కాకుండా, సొంతంగా స్టార్టప్‌లు ప్రారంభించే స్థాయికి ఎదుగుతున్నారన్నారు. విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ 156 సంస్థల్లో 1852 మంది ఉపాధి అవకాశాలు దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన అల్టెరా సీనియర్ అనలాగ్ డిజైన్ ఇంజినీర్, కళాశాల పూర్వ విద్యార్థి చక్రవర్తి భీమిశెట్టి ప్రసంగించారు. సంస్థ సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఇంజినీరింగ్, ఫార్మా కళాశాలల ప్రిన్సిపాల్స్ జె.సుధాకర్, అరుంధతి, వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ హరగోవిందరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యాపారి అరెస్ట్

కూర్మన్నపాలెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కిరాణా వ్యాపారిని దువ్వాడ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన వద్ద ఉన్న 29 క్వార్టర్ బాటిల్స్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. అగనంపూడి దిబ్బపాలెం కాలనీలో కిరాణా వ్యాపారం చేస్తున్న ఈగల రమణ మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు షాపుపై దాడి చేయగా 29 బాటిల్స్ ఇంటిలో లభించినట్లు పోలీసులు తెలిపారు. బాటిల్స్‌తో పాటు రమణను దువ్వాడ పోలీసులకు అప్పగించారు. సీఐ కె.మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి

ఆరిలోవ : ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలని జోన్ – 1 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) బి.విజయభాస్కర్ సూచించారు. డీఈవో కార్యాలయం ఆవరణలోని శిక్షణ కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఇన్‌స్పైయిర్ మనక్ – 2025 సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ గురువారం ముగిసింది. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులు సుమారు 100 మంది శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తి రేకెత్తించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. సైన్స్ పట్ల విద్యార్థులకు అభిరుచి కల్పించాలన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులు ద్వారా మంచి ప్రాజెక్టులు నామినేట్ చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం డీఈవో ఎస్.ప్రేమకుమార్ మాట్లాడుతూ జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో ప్రాజెక్టులు నామినేట్ అయ్యేవిధంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. జాతీయ స్థాయిలో విశాఖ జిల్లా విద్యార్థులు పాల్గొనేటట్లు ఉపాధ్యాయులు కృషి చేసి వారికి తగిన మార్గదర్శకత్వం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్‌రావు, ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు, రిసోర్స్‌పర్సన్స్ టి.వి.ఎస్.చంద్రాజీరావు, సూర్యనారాయణ, జానకిరామ్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు



డాక్‌యార్డ్ గొడౌన్స్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: ప్రజల ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దే వద్దని సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా గురువారం డాక్‌యార్డ్ సమీపాన గొడౌన్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలను మరిన్ని ఆర్థిక ఇబ్బందులకు గురిచేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా శాస్త్ర విజ్ఞాన రంగం అభివృద్ధి

మద్దిలపాలెం : శాస్త్ర విజ్ఞాన రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని డీఎస్‌సీ పూర్వ కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆచార్య ఇ.వెంకట్రావు ఎండోమెంట్ లెక్చర్‌లో ఆయన ప్రసంగించారు. ముందుగా ఆచార్య ఇ.వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సమాజంలో విశిష్ట గుర్తింపు పొందుతున్నారన్నారు. మానవ సంక్షేమంతోపాటు ప్లానెట్‌ని సంరక్షించుకునే దిశగా ప్రతి వ్యక్తి ఆలోచించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాల్లో వృద్ధాప్యాన్ని నియంత్రించే పరిశోధన జరిపే విభాగాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మరణాలు సంభవించడానికి కారణమవుతున్న వ్యాధులను, కారకాలను తెలియజేశారు. సముద్రం నుంచి ఉత్పత్తి అవుతున్న ఔషధాలను వివరించారు. భవిష్యత్‌లో మనం ధరించే వస్త్రాలు, గ్రీన్ టెక్నాలజీ, స్మార్ట్ హౌసెస్ వంటి విభిన్న అంశాలను వివరించారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో 30కి పైగా ఎండోమెంట్ లెక్చర్స్ ఉన్నాయని, వాటిని సంబంధిత విభాగాల్లో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజ శంకర్, విభాగ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.